www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 ఏప్రిల్ 2025

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు పోరాటం : ఎంఎల్‌సి

పాలకోడేరు : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు శాసనమండలిలో తనవంతు పోరాటం చేస్తున్నానని, దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం ఎంతో అవసరమని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. బుధవారం బంటుమిల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి పివిఎస్.నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. మారిన విద్యారంగం స్వరూపంలో బంటుమిల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా గుర్తించడం జరిగిందన్నారు. దీనిని తల్లిదండ్రులు, గ్రామస్తులంతా కలిసి కాపాడుకోవాలన్నారు. ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ బంటుమిల్లి గ్రామంలో ప్రజలు చైతన్యవంతులన్నారు. గ్రామ పెద్దలందరినీ కలుపుకుని ఎస్‌ఎంసి సభ్యులతో కలిసి చేసిన ప్రచారం అభినందనీయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం జివివి.రామానుజరావు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోట కాశీజగన్నాథం, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, గ్రామ సర్పంచి పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలనీల్లో దాహం కేకలు..!

ఏళ్ల తరబడి సమస్యను పట్టించుకునే వారే కరువు
కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి
వేసవిలో పరిస్థితి మరింత దారుణం
సిపిఎం ప్రజాచైతన్య యాత్ర ఫలితంగా కొన్ని కాలనీల్లో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - భీమవరం

సాధారణంగా వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయి. అయితే ఆ కాలనీవాసులు మాత్రం ఏడాది పొడవునా దాహార్తితో అలమటించాల్సిందే. తాగునీటికి ప్రణాళికలు రూపొందిస్తున్నా చుక్క నీరు దొరకని దుస్థితి. కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటే తప్ప గొంతు తడవని పరిస్థితి. వేసవిలో అయితే పరిస్థితి మరింత దారుణం. ఏళ్ల తరబడి తాగునీటి సమస్య ఉన్నా అటువైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. ఫలితంగా ప్రభుత్వ కాలనీ వాసులు దాహార్తితో అలమటిస్తున్నారు.

ప్రభుత్వాలు ఆర్భాటంగా కాలనీలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నాయి. కనీస సౌకర్యాలు కల్పించకుండా అసౌకర్యాల నిలయంగా మార్చింది. కనీసం తాగునీటి అవసరాలు తీరక కాలనీవాసులు నానావస్థలు పడుతున్నారు. తాగునీటి వసతులు కల్పించండి మహాప్రభో అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా కనీసం స్పందించిన దాఖలాల్లేవు. ఏళ్ల తరబడి సమస్య అలానే ఉండటంతో కాలనీవాసులు గొంతు తడుపుకునేందుకు నీళ్ల కొనుగోలు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవడం వంటివి చేస్తున్నారు. ప్రతియేటా తాగునీటి పథకాలకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ అవేమీ ప్రభుత్వ కాలనీల్లో సమస్యను పరిష్కరించని పరిస్థితి. ఇక ఊరికి దూరంగా కాలనీలు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతానికి పైపులైన్ వేసేందుకు రూ.కోట్లలో ఖర్చవుతుందని అధికారులు సాకులు చెబుతున్నారు. ఆయా కాలనీ ప్రజలు గట్టిగా నిలదీస్తే తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టి ఆ తర్వాత చేతులెత్తేస్తున్నారు. కొన్నిచోట్ల కలుషిత నీరు వస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. ఓపక్క డ్రెయినేజీలు లేక దోమలు విజృంభించి రోగాల బారిన పడుతుంటే కలుషిత నీటితో పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. దీంతో వేలాది రూపాయలు చికిత్స నిమిత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక సామాన్య, మధ్యతరగతి కుటుంబం నీటి కొనుగోలు నిమిత్తం రోజుకు రూ.20 నుంచి రూ.40 వరకు ఖర్చు చేస్తున్నారు. నెలకు రూ.600 నుంచి రూ.1000 వరకు ఖర్చు చేస్తున్న పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉంటే చేపలు, రొయ్యల చెరువుల నీటిని కాల్వల్లోకి వదిలేస్తున్నారు. ఆ కాల్వల్లో నీటినే తాగునీటి చెరువుల్లోకి నింపుతున్నారు. పసర్లు కమ్మిన నీటిని తాగలేక జనం నీటిని కొనుగోలు చేసుకోవాల్సి రావడం అనివార్యంగా మారింది. 2014 ఎన్నికల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి కుటుంబానికి 20 లీటర్లు నీటిని ఉచితంగా ఇస్తామని టిడిపి చెప్పింది. గెలిచిన తర్వాత పట్టించుకున్న పరిస్థితి లేదు. 2019 ఎన్నికల ముందు జిల్లాలో సాగిన పాదయాత్రలో వైసిపి అధినేత జగన్ తమ పార్టీ అధికారంలోకి రాగానే గోదావరి నుంచి పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తామని చెప్పి వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చారు. దీనికోసం వైసిపి ప్రభుత్వం రూ.3670 కోట్లతో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. అయితే ఈ పనులు ఒక అడుగూ ముందుకు పడలేదు. అయితే జలజీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు మాత్రం పూర్తిస్థాయిలో చేపట్టలేదు.



మొగల్లు ప్రభుత్వకాలనీలో ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంకు

దాహార్తితో కాలనీవాసులు విలవిల..

సీతారామపురం నార్త్ ప్రాంతంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడ తాగునీరు సరఫరా కావడం లేదు. కుళాయి కనెక్షన్ అడిగినా పట్టించుకునే వారు లేరు. దీంతో రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నరసాపురం ప్రభుత్వ కాలనీకి కనీసం పైపులైన్ కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ నివాసం ఉంటున్న వారంతా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. చించినాడ ప్రభుత్వ కాలనీవాసులకు కుళాయి కనెక్షన్లు ఇవ్వట్లేదు. తాగేందుకు నీరు లేక సుదూర ప్రాంతం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోడూరు వైఎస్ఆర్ కాలనీకి పైప్‌లైన్ ఏర్పాటు చేసినా వాటి ద్వారా తాగునీటి సరఫరా లేదు. దీంతో చేసేదేమీ లేక వేరే ప్రాంతానికి నడిచి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. మినిమించిలిపాడు కాలనీకి పైపులైన్ ఏర్పాటు చేయలేదు. పెనుగొండ వైఎస్ఆర్ కాలనీకి అసలు తాగునీటి సౌకర్యమే లేదు. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను కాలనీలో అన్ని ఉన్నప్పటికీ తాగునీటిని సరిపడా సరఫరా చేయకపోవడం గమనార్హం. గణపవరం మండలం కోమట్లపాలెంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విస్సాకోడేరు ప్రభుత్వ లేఅవుట్ సమీపాన 60 ఎకరాల్లో తాగునీటి చెరువు ఉన్నప్పటికీ ఈ కాలనీకి తాగునీటిని అందించట్లేదు. మొగల్లు ప్రభుత్వ కొత్త కాలనీకి తాగునీటి సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ వాటర్ ట్యాంక్ నూతనంగా నిర్మించినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఉండి ప్రభుత్వ కాలనీకి తాగునీరు అందించట్లేదు. కాళ్ల ప్రభుత్వ కాలనీలో మంచినీటి సౌకర్యం ఉన్నా పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయట్లేదు. కాళ్లకూరు వెంకటాపురం కాలనీకి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో దూరప్రాంతం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని అధికారులను కోరుతున్నా రూ.10 వేలు కట్టాలని చెబుతున్న పరిస్థితి ఉంది. ఆకివీడు తాళ్లకోడు కాలనీలో అనేక కుటుంబాలు నివాసముంటున్నా ఈ ప్రాంతానికి సైతం తాగునీటిని అందించే పరిస్థితి లేదు.

ప్రభుత్వ కాలనీవాసుల్లో భరోసా నింపిన సిపిఎం యాత్ర..

జిల్లావ్యాప్తంగా ఇటీవల సిపిఎం ప్రజా చైతన్య సైకిల్ యాత్ర చేపట్టి ప్రజా సమస్యలపై అధ్యయనం చేసింది. ఈ సైకిల్ యాత్ర బృందం ఎదుట ప్రభుత్వ కాలనీల ప్రజలు అనేక సమస్యలు ప్రస్తావించి కంటతడి పెట్టారు. దీనిలో ప్రధానంగా తాగునీటి సమస్యపై జిల్లావ్యాప్తంగా ప్రజానీకం ఏకరువు పెట్టారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా లేవు అని తామంతా ఎలా బతికేది అంటూ కన్నీరుమున్నీరుగా బృందం వద్ద వాపోయారు. ఈ నేపథ్యంలో సిపిఎం స్థానికంగా ఉన్న సమస్యలతోపాటు ప్రధానంగా తాగునీటి సమస్యను జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసింది. దీంతో ఆయా కాలనీవాసుల్లో భరోసా నిండింది.

పొట్టకూటి కోసం వెళ్తే..!

ఉపాధి కూలీలపైకి దూసుకెళ్లిన వ్యాను - ముగ్గురు దుర్మరణం
మరొకరి తీవ్ర గాయాలు
సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించిన కలెక్టర్, ఎంఎల్ఎ, ప్రముఖులు
మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వ్యకాస ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు, నరసాపురం

వారంతా రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన కూలీలు. వ్యవసాయ పనులు తగ్గడం, ప్రత్యామ్నాయంగా మరే పనులూ దొరక్కపోవడంతో తక్కువ కూలీ వచ్చినా ఉపాధి హామీ పనులే శరణ్యంగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఓ పక్క వృద్ధాప్యం తరుముకొస్తున్నా పొట్ట నింపుకోవడం కోసం కుటుంబ యావత్తూ ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతున్నారు. ఎప్పటిలానే బుధవారం ఉదయమే ఉపాధి పని ప్రదేశానికి చేరుకున్నారు. పనులు ప్రారంభించడానికి సిద్ధమవుతున్న తరుణంలోనే వ్యాన్ రూపంలో మృత్యు శకటం వారిపైకి దూసుకొచ్చింది. అత్యంత విషాదకరమైన ఈ ఘటన మొగల్తూరులోని నల్లంవారితోటలో జాతీయ రహదారిని ఆనుకుని జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృత్యువాత పడగా మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రులు సమీప బంధువులే కావడంతో వీరి నివాసప్రాంతమైన నక్కావారిపాలెం ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం. మొగల్తూరు పంచాయతీ సుబ్రహ్మణ్యేశ్వరం (నక్కావారిపాలెం) చెందిన ఉపాధి కూలీలు నల్లంవారితోట, పెద్దపల్లవపాలెం గ్రామాల మధ్య ఉన్న పంట బోదెలో పూడిక తొలగించేందుకు బుధవారం ఉదయం కొలతల కొలుస్తుండగా గుంటూరు జిల్లా నరసరావుపేట నుంచి మొగల్తూరు వంట నూనె లోడుతో వస్తున్న వ్యాను అదుపుతప్పి కూలీలపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో గుబ్బల గంగాదేవి (55), కడలి పావని (45) అక్కడికక్కడే మృతి చెందారు. గంగాదేవి భర్త మాణిక్యాలరావు, గుడాల సత్యనారాయణ తీవ్ర గాయాలపాలయ్యారు. మృతురాలు కడలి పావనికి పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంటనే స్థానికులు, పోలీసులు రంగంలోకి దిగి గాయాలపాలైన వారిని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న గుబ్బల మాణిక్యాలరావును, గుడాల సత్యనారాయణను భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మాణిక్యాలరావు(57) మృతిచెందారు. మృత దేహాలను నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, బాధితులను పరామర్శించిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిఎస్‌పి జి.శ్రీవేద ట్రెయినీ డిఎస్‌పి మానస, డ్వామా పీడీ కెసి హెచ్ అప్పారావు, ఆర్‌డిఒ దాసిరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు తదితరులు పరిశీలించారు. అనంతరం నరసాపురం ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను కలెక్టర్, ఎంఎల్ఎ, తదితరులు పరామర్శించారు. ఈ ప్రమాదంపై మొగల్తూరు ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొగల్తూరులో ఉపాధి హామీ పనిచేస్తూ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు డిమాండ్ చేశారు. నరసాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జార్జి, పెద్దిరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీలో మృతి చెందిన కుటుంబాలకు ఎంఎల్ఎ, జిల్లా కలెక్టర్ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున, గాయపడిన కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటన చాలా బాధాకరమని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు రూ.10 వేలలు చొప్పున, గాయపడిన వారికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు.

సంఘటనలో తీవ్రంగా గాయపడిన గుబ్బల మాణిక్యాలరావుకు చికిత్స నిమిత్తం విప్ బొమ్మిడి నాయకర్ రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాణిక్యాలరావును భీమవరం ఆస్పత్రి నుండి గుంటూరు తరలించేందుకు అత్యవసర వాహనానికి ఆయన వైద్య ఖర్చు నిమిత్తం ఈ నిధులను అందించారు. ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపడతామన్నారు.

గంగాదేవి మృత దేహం వద్ద రోదిస్తున్న బంధువులు

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్, ఎంఎల్ఎ

నిరసన తెలుపుతున్న వ్యకాస నేతలు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం : ఆరోగ్యవంతమైన బిడ్డలు కలిగేందుకు గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని, క్రమం తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా బుధవారం భీమవరం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డలు బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. స్త్రీ గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యే వరకూ వైద్యుల సూచనలు మేరకు మందులు, బలవత్తరమైన ఆహారం తీసుకుంటేనే బిడ్డ పుట్టిన తర్వాత ఎటువంటి అనారోగ్య సమస్యలు రావన్నారు. గర్భిణులు బయట హోటళ్లలో ఆహార పదార్థాలు, కూల్ డ్రింక్స్, చాక్లెట్స్ వంటివి తినకూడదని స్పష్టం చేశారు. ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో చక్కగా రాణించగలమన్నారు. గర్భిణులు ప్రతిరోజూ పాలు, ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా వైద్యాధికారులు, సిబ్బంది వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు 15 మంది గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించి, వివిధ రకాల ఫలాల కిట్లను అందజేశారు. అనంతరం ఏడో పౌష్టికాహార పక్షోత్సవ సమాచార గోడ పత్రికను కలెక్టర్, ఎంఎల్ఎ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, జిల్లా వైద్య శాఖ అధికారి గీతాబాయి, సిడిపిఒలు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలని..

మే 20న జాతీయ సమ్మె

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా మే 20వ తేదీన సమ్మె నిర్వహించాలని జాతీయ కార్మిక సంఘాలు నిర్ణయం తీసుకున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. భీమవరం సిఐటియు కార్యాలయంలో బుధవారం ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన దగ్గర్నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. వీటివల్ల యూనియన్స్ రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి వేతనాలు, ఇతర సౌకర్యాలు, సమ్మె చేసే హక్కు, నిరసన వ్యక్తం చేసే హక్కు వంటివి కార్మికుల చేతుల్లోంచి లాక్కునే విధంగా ఉన్నాయన్నారు. కార్మికుల సంక్షేమం గాలిలో ఉండే పరిస్థితిని పాలకులు సృష్టిస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ జిల్లాలో సమ్మెను జయప్రదం చేసే విధంగా ముందుకు సాగుతోందన్నారు. మేడే సందర్భంగా ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకుందామనే నినాదంతో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వి.గోపాలన్, నాయకులు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జె.శ్రీనివాస్, డి.కళ్యాణి, ఎం.ఆంజనేయులు, అజయ్‌కుమారి, కె.ఝాన్సీలక్ష్మి, హసీనా బేగం, జ్యోతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడుతూ మున్సిపాల్టీలో ఏళ్ల తరబడి సేవలందించి మృతి చెందిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలని, కాంటాక్ట్ కార్మికుల రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు ఉండాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్లాప్ ఆటో కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలని, కార్మికులకు సరిపడా పనిముట్లు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొడమంచిలి బాబు, తాడికొండ జయరాం, అల్లం పూర్ణిమ, తాడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా వ్యాప్త సామాజిక చైతన్య యాత్ర మూడవరోజైన బుధవారం యలమంచిలి మండలం చించినాడ గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ సమాజంలోని పేద, బడుగు వర్గాల జీవన ప్రమాణాన్ని పెంచాల్సిన ప్రభుత్వాలు అవేవీ వారికి పట్టనట్లు వ్యవహరిస్తూ.. కేంద్ర ప్రభుత్వం తరుపున ఎంపీలకు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఎంఎల్ఎలకు ఇష్టానుసారం జీతాలు పెంచుకున్నారన్నారు. కానీ కనీసం మహిళలకు సరైన ఉపాధి అవకాశాలు కూడా చూపలేకపోతున్నారని విమర్శించారు. ఐద్వా జిల్లా కోశాధికారి సరిపల్లి జయప్రభ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలు ఇచ్చారని వాటిని అమలుపరచకుండా ప్రజలను ఏ మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనియెడల మహిళలందరినీ సంఘటితం చేసి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జిల్లెల్ల ప్రశాంతి, జయశ్రీ, నాగమణి, ధనలక్ష్మి పాల్గొని యాత్రను ముందుకు సాగనంపారు.

ఆకివీడు : కులమత, వర్గ, వర్ణ, లింగ విచక్షణ లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ సమానంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరికీ మార్గం కల్పించాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి అన్నారు. సామాజిక న్యాయాన్ని సాధించాలనే నినాదంతో సామాజిక చైతన్య యాత్ర జిల్లాలో 14వ తేదీన ప్రారంభమైంది. ఈ జాత కొనసాగింపుగా మండల కేంద్రంలో మూడవ రోజు స్థానిక వార్డుల్లో గ్రూప్ మీటింగ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఉదయ్‌కుమారి మాట్లాడుతూ స్త్రీలు పురుషులతో పాటుగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆనాటి నుంచి కూడా స్త్రీలకు సమాన హక్కులను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయన్నారు. అనంతరం ఐద్వా పట్టణ అధ్యక్షులు డోకల లక్ష్మీ మాట్లాడుతూ స్త్రీలకు సమాన హక్కులు కల్పించిన రోజే సామాజిక న్యాయాన్ని సాధించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో కింజరాపు పార్వతి, గేదెల విజయ లావణ్య, బి.కళ్యాణి, జి.రాణి, కృష్ణవేణి, పరాలమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

యలమంచిలిలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

ఎస్ఐకు ఎబిసిడి అవార్డు

ఆచంట : రాష్ట్ర పోలీసు శాఖలో అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్(ఎబిసిడి) అవార్డు నేరాల గుర్తింపులో ఉత్తమ అవార్డు ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణకు వరించింది. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి చేతుల మీదగా బుధవారం ఆయన ఈ అవార్డును అందుకున్నారు. నేర పరిశోధన, గుర్తింపులో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీసు సిబ్బంది, బృందాలకు ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డు ఇది. ఈ తరహాలో కేసులను పరిష్కరించడంలో నేరస్థులను న్యాయం ముందు నిలబెట్టడంలో పోలీసుల అసాధారణ కృషి, అంకితభావాన్ని ఈ అవార్డులు గుర్తిస్తాయి. అటువంటి ఈ అవార్డు మన ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణకు రావడం అభినందనీయమని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అవార్డు అందుకుంటున్న ఎస్ఐ

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పాలకోడేరు : వేంద్ర గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ వేతనదారులకు పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ ఆర్థిక సహకారంతో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధి హామీ చట్టంలో కొండయ్య చెరువును 150 మంది వేతనదారులు తవ్వకం పనులు చేపట్టారు. వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు వేతనదారులకు పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్ ఆర్థిక సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి నాగేశ్వరి వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాతి, వేతనదారులు పాల్గొన్నారు.

మజ్జిగ అందిస్తున్న కృష్ణమోహన్

సుందరయ్య కాలనీలో రోడ్లు శుభ్రం చేయాలి

సమతానగర్ వాసుల ధర్నా, కమిషనర్‌కు వినతి

ఆకివీడు : సమత నగర్ సుందరయ్య కాలనీలో ప్రధాన రహదారిలో కాలువ గట్టు పూడిక మట్టిని రోడ్లపై వేయడం తగదని, ఇక్కడ వెంటనే శుభ్రం చేయాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. గట్టు శుభ్రం చేయడం, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యపై నిరంతరం బాధపడుతున్నామని వారు వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏరియా కమిటీ కార్యదర్శి కె.తవిటి నాయుడు మాట్లాడుతూ అట్టడుగు బలహీన వర్గాల ప్రాంతంలో సరైనటువంటి రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వేసవి కాలం సమీపించడంతో మంచినీరు లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి రాంబాబు, సాక కిసింజర్, మేరీ, రాణి, జ్యోతి, ఏసు, మరియమ్మ పాల్గొన్నారు.

వినతిని అందజేస్తున్న కాలనీ వాసులు

ఆకివీడు ఎఎంసి ఛైర్మన్‌గా వెంకట్రావు

ఆకివీడు : ఆకివీడు ఎఎంసి ఛైర్మన్ పదవి ఎట్టకేలకు ప్రకటించారు. ఆస్థానాన్ని ముందు అనుకున్న విధంగానే టిడిపి సీనియర్ నాయకుడు, ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు ఆకివీడు ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. సుమారు 1988 సంవత్సరం నుంచి టిడిపి పార్టీ సభ్యుడుగా ఉన్న వెంకట్రావు 1994 నుంచి క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. అదే పార్టీ నుంచి ఆకివీడు గ్రామపంచాయతీ సభ్యుడుగా, మండల పరిషత్ సభ్యుడుగా ఎన్నికై ఆయన పనిచేశారు. సుమారు 30 సంవత్సరాలుగా ఏ పదవి లేకుండానే పార్టీలో అంకితభావంతో చేస్తున్న వెంకట్రావుకు రిజర్వేషన్ క్రమంలో ఈ ఛైర్మన్ పదవి వివరించిందని చెప్పాలి. ఈ పదవికి అతనిని ఎంపిక చేయడంలో పార్టీ మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ ప్రముఖ పాత్ర పోషించారు. వెంకట్రావు నియామకం పట్ల పార్టీ ప్రముఖులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అత్తిలి ఎఎంసి ఛైర్మన్‌గా ప్రసాద్

తణుకు రూరల్ : అత్తిలి జనసేన మండల అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న దాసం ప్రసాద్‌ను అత్తిలి మండల ఎఎంసి ఛైర్మన్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. తణుకు నియోజకవర్గంలో కూటమి గెలుపులో అత్తిలి మండలంలో చేసిన విశేష కృషికి గాను ఈ పదవి లభించిందని చెబుతున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాధితునికి మానవత సాయం

పాలకొల్లు రూరల్ : మండలంలోని వడ్లవానిపాలెం గ్రామానికి చెందిన సిద్దుల గాంధీ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై ఆర్థిక ఇబ్బంది పడుతున్నాడు. ప్రమాద బాధితునికి మానవత ద్వారా బుధవారం ఆయన ఇంటి వద్ద రూ.10,116 మానవత పాలకొల్లు మండల శాఖ అధ్యక్షుడు మద్దాల వాసు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన చేగొండి వెంకటహరిరామ జోగయ్య, పెన్మెత్స సత్యసాయిబాబా, బోళ్ల శ్రీనివాసరావు, మద్దాల వాసు, రేకపల్లి లక్ష్మణ్, పెన్మెత్స కేశవరాజు, డాక్టర్ పిఎస్.ప్రతాప్‌రాజు, జుత్తిగ నాగసత్య నారాయణ, వైఎస్ఆర్, ఎస్.రామసూర్య, విన్నకోట వెంకటరమణ, దండు పద్మావతి, యిమ్మిడి రాజేష్, డాక్టర్ ముత్యాల సిరిచందన, కావలి నగేష్‌లకు మానవత జిల్లా ఆత్మీయ కమిటీ డైరెక్టర్ ముత్యాల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత కన్వీనర్ ముత్యాల రామారావు, కోశాధికారి శ్రీవాత్సవ ప్రదీప్, సభ్యులు రావాడ సతీష్, గుడాల హరిబాబు, విన్నకోట వెంకట రమణ, పోతాబత్తుల సత్తిబాబు, పెన్మెత్స సాయిరాజు పాల్గొన్నారు.

పూలపల్లిలో గ్రామసభ

పాలకొల్లు రూరల్ : మండలంలోని పూలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరావు అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్, పాముల రజనీ హాజరయ్యారు. పట్టణ విలీన గ్రామాలలో ఒకటైన పూలపల్లి గ్రామానికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు సహకారంతో 201 జాబ్ కార్డులు మంజూరు చేశారు. సరైన ఉపాధి పనులు లేక ఇబ్బంది పడుతున్న వారికి ఊరట లభించింది. దీంతో ఉపాధి హామీ పనులతో బిజీ అయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ పాల శ్రీనివాస్, టిడిపి గ్రామ అధ్యక్షులు వి.వి.శ్రీహరి రాజు, గుబ్బల ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుమారుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

నరసాపురం : గత 15 సంవత్సరాల నుంచి తన కుమారుడు పప్పుల భాస్కర శ్రీకృష్ణ నరేష్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం తప్పకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని పప్పుల రామారావు తెలిపారు. నరసాపురం పట్టణానికి చెందిన వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పప్పుల వెంకట రామారావు కుమారుడు 15వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలోని పలుచోట్ల రుస్తుంబాద లెప్రసీ కాలనీలో పేదలకు, బొండమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, పాత బజార్ సాయిబాబా గుడి వద్ద పేదలకు పలుచోట్ల అన్న సమారాధన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా పప్పుల రామారావు మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో కనీస రక్షణ కవచాలైన హెల్మెట్లు పంపిణీ వగైరా కార్యక్రమాలు చేస్తూ తన బిడ్డకు జరిగిన అన్యాయం మరొక బిడ్డకు కలగకూడదని కోరుకుంటున్నామని అన్నారు. తన బిడ్డ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఆయన వివరించారు.

సూర్యారావు మృతికి సంతాపం

పెనుమంట్ర : మండలంలోని పొలమూరు గ్రామంలో అమరజీవి తుటే సూర్యారావు మృతికి సిపిఎం నాయకులు బుధవారం ప్రగాఢ సంతాపం, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. 85 సంవత్సరాల వయస్సుతో సిపిఎం సీనియర్ నాయకునిగా, 45 సంవత్సరాలు సిపిఎం పార్టీ సభ్యులుగా, రిక్షా కార్మికులుగా సేవలందించిన వ్యక్తి తుటే సూర్యారావు అని వారు అన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ నివాళులు అర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాసప్రసాద్, పొలమూరు గ్రామ శాఖ సభ్యులు చింతపల్లి తిరుమలరావు, పంపన సూర్యనారాయణ, పిల్లి రాజారావు, పార్టీ సభ్యులు మంగం సూర్యనారాయణ, కెవిపిఎస్ నాయకులు బత్తుల విజయకుమార్ పాల్గొని నివాళులర్పించారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా మూర్తిబాబు

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న టి.మూర్తి బాబును ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ప్రభుత్వం వారు డిజిగ్నేషన్ మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయంలో పాలకొల్లు ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరావు మూర్తి బాబును అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల శ్రీనివాస్, ఎల్.సత్యనారాయణ, సుంకర గాయత్రి, అన్ని గ్రామాల కార్యదర్శులు, మెడికల్ డిపార్ట్‌మెంట్ గుడాల హరిబాబు మూర్తి బాబును అభినందించి సత్కరించారు.

పేదలకు ఇంటి స్థలం మంజూరు చేయాలి

భీమవరం టౌన్ : ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక, అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి గృహ నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేసి పేదల సొంతింటి కల నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భీమవరం రూరల్ తాడేరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించి, గ్రామ రెవెన్యూ అధికారి సిహెచ్.మోహన్ రావుకు ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, చేతివృత్తులు సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఛాన్ భాషా, పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాల అర్జీదారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికి 22న మహా ధర్నా

వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

పెనుమంట్ర : ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈనెల 22న కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పొలమూరు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలతో మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు సక్రమంగా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస ప్రసాద్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, వ్యకాస నాయకులు ఎం.సూర్యనారాయణ, దొంగ భవాని, పెచ్చెట్టి బుజ్జి లక్ష్మి, జక్కంశెట్టి ధన శ్రీలక్ష్మి, మాముదూరు క్రాంతి, పాలపర్తి సుబ్రమణ్యం, సిలకపేట రామారావు, కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్ద గోపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పాలకొల్లు : పాలకొల్లు పట్టణం పెద్ద గోపురం ప్రాంతంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు పెచ్చెట్టి బాబు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఈ ప్రాంతంలో లోవోల్టేజ్ సమస్య వేధిస్తోందని, గత ప్రభుత్వంలో నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. మంత్రి రామానాయుడు నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్య లేకుండా చేయాలని ఆదేశించారని, నియోజకవర్గంలో 99 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ రామకృష్ణ, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్ది, తులి మాలింగేశ్వరరావు, సిడగం సూరి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ఆకివీడు : రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు డిమాండ్ చేశారు. ఆకివీడు ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు మాట్లాడుతూ [illegible] ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి పది నెలలు గడుస్తున్నా అమలు కాలేదని విమర్శించారు. అనంతరం ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎస్‌కె.బాజీ, కొల్లాటి శ్రీను, అధ్యక్షులుగా జోగి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎ.దేవి, ఉపాధ్యక్షులుగా కె.జాన్స్, సహాయ కార్యదర్శిగా నక్కిన రమేష్, సభ్యులుగా వెంకటరావు, చల్లా రాజు, సిహెచ్.వెంకన్న, బాబు, కరిం, రమేష్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పెనుగొండ : వ్యాన్ ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వడలి వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనుగొండ మండలం వడలి గ్రామం లంక వీధికి చెందిన తాడేపల్లి బాబు(18) పెనుగొండ నుంచి ద్విచక్ర వాహనంపై స్నేహితుడితో కలిసి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. తన స్నేహితుడు గాయాలతో బయటపడ్డాడు. పెనుగొండ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


ఎంఎల్ఎకి వినతిపత్రాన్ని అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎంఎల్ఎ నాయకర్‌ను కోరిన రోటరీ సభ్యులు

నరసాపురం : రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను బుధవారం నరసాపురంలో ఆయన స్వగృహంలో రోటరీ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నరసాపురంలో నెలకొన్న సమస్యలను ఎంఎల్ఎ నాయకర్‌కు తెలియజేసి వాటి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో శ్మశానవాటికను అభివృద్ధి చేసి తీర్చిదిద్దాలన్నారు. గోదావరి జలాలు కాలుష్యం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బస్టాండ్ దగ్గర క్లాక్ టవర్ ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసాపురం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి, కోట్ల రామకృష్ణ, కనకం వరప్రసాద్, ఆత్మూరి రమా, సిహెచ్.మురళీ, తోట శ్రీధర్ ఉన్నారు.

ఆపన్నులకు అండగా మానవత

ఉండి : సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆపన్న హస్తం ఇస్తుందని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని చెరుకువాడలో బుధవారం మోదుగుమూడి పెద్దిరాజు కుటుంబానికి ఉండి మానవత శాఖ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు, కొంత నగదు అందించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ మానవత సంస్థ సేవలు వెలకట్టలేనివి అన్నారు. సంస్థ మండల ఛైర్మన్ రుద్రరాజు యువరాజు, కో ఛైర్మెన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ బాధల్లో ఉన్నవారికి అండగా నిలబడటమే మానవత ప్రధాన ధ్యేయం అన్నారు. సంస్థ కోశాధికారి కెటిఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు ముందుకు వచ్చి మానవతకు సహాయపడితే మరిన్ని సేవా కార్యక్రమాలు ఎక్కువ మందికి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు రాములమ్మ, ఆర్ఎస్.బాబు, మాన్యం వాసు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామమ్

నరసాపురం : అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామమ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పంజా సెంటర్ సువర్ణ అపార్ట్‌మెంట్ నివాసితులకు అగ్నిమాపక వారోత్సవాల ఉద్దేశ్యం, అగ్నిప్రమాదలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిమాపక అధికారి భాస్కర్ రామమ్ ఇంట్లో ఉపయోగించే ఎల్‌పిజి గ్యాస్ వాడటంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. వంటగదిలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే ఏవిధంగా ఆర్పాలో సిబ్బంది డెమో ద్వారా నివాసితులకు వివరించారు. అనంతరం వివిధ రకాల పరికరాల ద్వారా ఏవిధంగా అదుపుచేస్తారో డెమో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

మొగదిండిలో కిక్కిస తొలగింపు పనుల పరిశీలన

కాళ్ల : సీసలి-జక్కరం గ్రామాల మధ్య ఉన్న మొగదిండి మేజర్ మురుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన కిక్కిస, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు బుధవారం పరిశీలించారు. మొగదిండి మేజర్ మురుగు కాలువల్లో సుమారు రూ.30 లక్షలతో 7.2 కి.మీ మేర చేపట్టిన పనులు పూర్తిగా నాణ్యతతో ఉండాలని డీసీ చైర్మన్ ఫణిబాబుకు ఆయన సూచించారు. నీటిసంఘాల నిరంతర పర్యవేక్షణలో గతంలో ఎన్నడూ చేయలేని విధంగా ఈసారి పూర్తి స్థాయిలో యుద్ధ ప్రాతిపాదికన కిక్కిస, గుర్రపు డెక్కను తొలగించడం జరుగుతుందన్నారు. ఉండి వాటర్ డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, కొత్తపల్లి నాగరాజు, టిడిపి నాయకులు గాదిరాజు సుబ్బరాజు, బూడి వెంకట పర్రాలు, డ్రెయినేజీ ఎఇ లీలాప్రసన్న పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ పరిశీలన

నరసాపురం : అన్నక్యాంటీన్లలో అందిస్తున్న ఆహార పదార్థాలు, సమయంపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియజేయవచ్చని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. బుధవారం స్టీమర్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లలో రూ.5కే పేదలకు ఆహారం అందిస్తుందన్నారు. క్యాంటీన్ల సమయం, ఆహారంపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నారన్నారు. అన్నక్యాంటీన్లలో ప్రతి రోజు నిర్దేశిత సమయంలో ఆహారం అందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే క్యాంటీన్లలో ఉదయం 7 గంటల నుండే ఆహారం అందించేలా సమయం మార్చారన్నారు. కనుక క్యాంటీన్‌కు వచ్చే ప్రజలు తమ అభిప్రాయాలను క్యాంటీన్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ రవిచంద్ర, ఎఇ దుర్గా కిషోర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానీయకండి : ఎంఎల్ఎ

తణుకు : వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు, ఆయా గ్రామ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశించారు. బుధవారం తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు చెందిన అధికారులు, సంబంధిత కార్యదర్శులతో తణుకు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాధాకృష్ణ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెలా మూడోవ శనివారం జరిగే స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర నిర్వహణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధానికి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పంచాయితీ సిబ్బంది ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు. తణుకు నియోజకవర్గ పరిశీలకులు యర్రా వేణుగోపాల్‌రాయుడు, ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రయోగశాల సందర్శన

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రయోగశాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం సందర్శించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా తాడేపల్లిగూడెం ప్రయోగశాలలో రూ.27 లక్షలతో ఏర్పాటుచేసిన అటోమిక్ అబ్జర్వన్ స్పెక్ట్రో ఫోటోమీటర్‌ను, రూ.21 లక్షలతో ఏర్పాటు చేసిన గ్యాస్ లిక్విడ్ చోరోమెటోగ్రఫీ మిషనరీని ప్రారంభించారు. ప్రయోగ పరీక్షలు నిర్వహించే విధానాన్ని, శిక్షణ పొందిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఎడిఎ జె.శశి బిందు, డిడి శ్రీనివాస్, ఎఒలు వై.ఇందిరా ఝాన్సీ, ఎడిఎ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి

సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. జిన్నూరులో ఉపాధి పనిప్రదేశంలో కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.26 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. కూలీలకు తక్షణమే పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. పనిప్రదేశంలో మజ్జిగను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేతల వేంకటేశ్వరు, కె.పద్మ, వై.బిందు పాల్గొన్నారు.

నేల కొరిగిన వరిచేలు

ప్రజాశక్తి - ఆకివీడు

అన్నదాతల ఆవేదన

నేలకొరిగిన వరిచేలను చూపిస్తున్న రైతు

గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పుల ప్రభావంతో వరి రైతుకి తీవ్ర నష్టం ఏర్పడుతోంది. ఈ ప్రాంతంలో దాల్వా వరిచేలు తయారైపోయాయి. 60 శాతం పైబడి వరిచేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే 30 నుంచి 40 శాతం వరిచేలు కోతలు పూర్తయ్యాయి. కోతకు సిద్ధంగా ఉన్న చేలు నిలువెత్తు సస్యం తయారైంది. మరో వారం రోజుల్లో ధాన్యం మొత్తం గట్టుకు చేరడంతో రైతు ఊపిరి పీల్చుకుంటాడు. ఈ దశలో వాతావరణంలో వచ్చిన మార్పు రైతుకి తీరని నష్టం కలిగిస్తోంది. ఈమధ్యన వీచిన భారీగాలులు, కురిసిన భారీ వానకు కోతకు సిద్ధమైన వరిచేలు నేలకొరిగాయి. ఈ వానలకు రైతులు బెంబేలెత్తిపోతున్నారు. సంవత్సర కష్టం దాల్వా పంట కొద్ది రోజుల్లో చేతికందే పరిస్థితుల్లో చేయి జారిపోతే రైతుల బాధ వర్ణనాతీతం. చేతికందిన పంట నోటికి అందని పరిస్థితిలో రైతులు లబోదిబోమంటున్నారు. అకాలపు వర్షం రైతును నిండా ముంచిన పరిస్థితి నెలకొంది. వానలు ఇక్కడితో ఆగి, నాలుగు రోజులు ఎండ కాస్తే వరి చేలు ఆరితే సమస్య గట్టెక్కినట్టే. లేనిపక్షంలో రైతు కష్టం నీటిపాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

కూలీల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

మొగల్తూరు మండలంలో ప్రమాదంలో మృతిచెందిన ఉపాధి కూలీలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొగల్తూరు మండలం నల్లంవారి తోట వద్ద పనిలో ఉన్న ఉపాధి కూలీలపై మినీ వ్యాన్ పడిన దుర్ఘటనలో ఇద్దరు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతిచెందారని, మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఉపాధి పనిలో ఉండగా ప్రమాదం జరిగిందని, గుండెపోటు వంటిది కాదని, జాతీయ రహదారిపై వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బోధిలో పనిచేస్తున్న కూలీలపై పడటంతో మరణించారని తెలిపారు. ఫ్యాక్టరీ ప్రమాదాల్లో రూ.కోటి, ఇతర ప్రమాదాల్లో రూ.50 లక్షల వరకు ఇప్పించిన ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీలు మరణిస్తే నష్టపరిహారం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఉపాధి చట్టంలో పనిచేస్తుండగా మరణిస్తే రూ.50 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూడటం సరైనది కాదన్నారు. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యంతో పాటు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ఉద్యమ స్ఫూర్తి శిఖరం విశ్వనాధం మాస్టారు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

పెనుమంట్ర : విద్యార్థులకు 40 ఏండ్లు విద్యా బోధన సాగించడంతో పాటు యుటిఎఫ్ కార్యకర్తగా ఉద్యమ స్ఫూర్తిని శిరం విశ్వనాధం మాస్టారు ముందుకు తీసుకుని వెళ్లారని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల ఫంక్షన్ హాల్లో జరిగిన కాకిలేరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన విశ్వనాధం దంపతుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోయేలా ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా పాఠశాలలను మెర్జ్ చేస్తున్న విధానాన్ని అందరూ తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభకు పాఠశాల హెచ్ఎం బొడ్డు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఇరగవరం ఎంఇఒ కె.శ్రీనివాసరావు, పోడూరు ఎంఇఒ జివి.సూర్యనారాయణ, విశ్రాంత ఎంఇఒలు కృష్ణారావు, శ్రీరామకృష్ణ, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు, యుటిఎఫ్ నాయకులు కె.రామభద్రం, ఎస్ఎస్‌వి.అవధాని, కేతా వెంకటేశ్వరరావు, మానేపల్లి, ఎస్.పెద్దిరాజు, మానవత ప్రతినిధులు కొత్త సత్యనారాయణ మూర్తి, కర్రి కృష్ణారెడ్డి ప్రసంగించారు. తన వృత్తి జీవితంలో సహకరించిన అందరికీ శిరం మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

పాలకొల్లు : పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ కె,భద్రాచలం, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.యామిని తదితర అధ్యాపకులు కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ పంచభూతాలు ఈ ప్రకృతిని ఏవిధంగా కాపాడుతున్నాయో కందుకూరి వీరేశలింగం పంతులు కూడా 5 అంశాలైన స్త్రీ విద్య, సమాజసేవ, సంఘ సంస్కరణ, అవినీతి, మూఢ విశ్వాసాలపై తిరుగుబాటుతో పాటు అటు పత్రిక రంగాన్ని ఇటు సాహిత్య రంగాన్ని అక్షరాయుధంతో సంధించి, సమాజ కుళ్లుని ప్రక్షాళన చేసి నవ సమాజ నిర్మాణ సారధిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి ఎన్‌విడి.దినకర్, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ చెట్టి ఉషారాణి, అధ్యాపకులు డాక్టర్ వి.విజయలక్ష్మి, శ్రీనివాసరావు, మన్మధరావు, దుర్గేశ్వరి, రవికుమార్, ఆశాజ్యోతి, పార్ధసారధి, వంశీ, శ్రీదేవి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : సంఘ సంస్కరణలతో చరిత్రకే చరిత్ర సృష్టించిన వారు కందుకూరి వీరేశలింగం అని, రచయితగా, సంఘ సంస్కర్తగా జాతిచరిత్రలో నిలిచిపోయారని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత తెన్నేటి లక్ష్మీ నరసింహ మూర్తి, తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం జయంతి, తెలుగు పండితులకు బుధవారం సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సాగిరాజు సత్యనారాయణ రాజు, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు ఎం.సీతారాం ప్రసాద్, ఎస్‌కె.చాన్ భాషా, అరసవల్లి సుబ్రమణ్యం, కె.చంద్రరావు పాల్గొన్నారు.

పోషకాహారంపై శ్రద్ధ వహించాలి

పలుచోట్ల 'పోషణ్ పక్వాడ'

భీమవరం టౌన్ : గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు బలంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను బుధవారం భీమవరం మున్సిపల్ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, వివిధ రకాల ఫలాల కిట్‌ను అందజేశారు. **తాడేపల్లిగూడెం** : ఆరోగ్యవంతమైన భావి పౌరులకోసం పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వీకర్స్ కాలనీలో బుధవారం జరిగిన పోషకాహార పక్షోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతా శిశుసంరక్షణలో పోషకాలు కలిగిన ఆహారం అందించటం అత్యంత ముఖ్యమని అన్నారు. ఒక మహిళ ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిచ్చి రెండు సంవత్సరాలపాటు పోషకాహారంపై శ్రద్ధ వహిస్తే ఆ పిల్లల భవిష్యత్ ఎంతో బాగుంటుందన్నారు. ఎంతో విలువైన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని వరదనం గ్రామంలో పోషకాహార పక్వాడ కార్యక్రమం ఐసిడిఎస్ అధికారిని సిహెచ్.ఇందిరా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి శిశువులను ఏవిధంగా సంరక్షించి పోషించాలనేది వివరించారు. ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, అంగన్వాడీ సూపర్వైజర్ మల్లేశ్వరి, టిడిపి మండల అధ్యక్షులు పోతుల సూరిబాబు, మహిళ మండలి అధ్యక్షురాలు ద్రాక్షారపు జ్యోతి, జనసేన అధ్యక్షులు ఇంటి ప్రసాద్, మాజీ సర్పంచి వర్ధనపు కాంతరావు పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్వాడీ కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమం బుధవారం నాలుగవ రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా యుపిహెచ్‌సిలో పోషణ లోపాలు, ఇతర తీవ్ర లోపాలు ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల తల్లులకు తగు సూచనలను డాక్టర్ రాజశేఖర్, సిడిపిఒ వాణి విజయరత్నం అందించారు. **పెనుమంట్ర :** ప్రతీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ ట్రాకర్ యాప్ ద్వారా ఆ కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులను నమోదు చేసే ప్రక్రియ జరుగుతుందని పెనుమంట్ర ఐసిడిఎస్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. బుధవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని భట్లమగుటూరు, పెనుమంట్ర అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పోషణ ట్రాకర్ యాప్‌లో వారు సొంతంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం గురించి వివరించారు. సామాజిక వేడుకలో భాగంగా గర్భవతుల నమోదు కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొని నమోదు ప్రక్రియ గురించి అందరికీ తెలిపారు. **తణుకు :** గర్భిణులు, బాలింతలు మునగాకుపొడిని ప్రతీ రోజూ తీసుకునే ఆహారంలో చేర్చుకోవాలని, దాని వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని తణుకు అర్బన్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి అన్నారు. బుధవారం తణుకు మున్సిపాలిటీలో పౌష్టికాహార పక్షోత్సవాలను పురస్కరించుకొని స్థానిక 6వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కర్యకర్తలు పాల్గొన్నారు. **మొగల్తూరు :** పౌష్టికాహారం తీసుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. మొగల్తూరు పంచాయతీ సచివాలయం రెండులో పడమటిపాలెంలో పోషణ్ పక్వాడపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిహెచ్ఇఒ మూర్తి, సిహెచ్ఒ విజయలక్ష్మి, ఎంఎస్‌కె.సరిత, ఎఎన్ఎం పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

వీరవాసరం : నవుడూరు సెంటర్లో సిపిఎం కొణితివాడ, ఉత్తర పాలెం, నవుడూరు గ్రామ శాఖల ఆధ్వర్యంలో బుధవారం అమరవీరుడు కలిదిండి సూర్యనారాయణ రాజు స్మారకార్థం చలివేంద్రం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా అమరవీరుడు కలిదిండి సూర్యనారాయణ రాజు చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఆకుల హరేరామ్, లింగం సత్యనారాయణ, యాళ్లబండి మారియానాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత ప్రజానాట్యమండలి నాయకులు షేక్ వల్లి అమరవీరులను స్మరించుకుంటూ గీతాలాపన చేశారు. చలివేంద్ర సభకు అధ్యక్షత వహించిన సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ చలివేంద్రాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం చలివేంద్రం ప్రారంభించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతాగోపాలన్ మాట్లాడుతూ పార్టీ ప్రతి సంవత్సరం అమరవీరుడు సూర్యనారాయణ రాజు పేరుతో మజ్జిగ చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. సిపిఎం నాయకులు ఆకుల హరే రామ్, సత్యనారాయణ ముగింపులో మాట్లాడారు.కార్యక్రమంలో హనుమంతుడు మండల కార్యదర్శి కె.ప్రసాద్, కె.పద్మజ, బత్తుల విజయ్, చింతపల్లి తిరుమలరావు, కేతా జ్యోతిబాస్, అయినపూడి బాబురావు, కిలాడి సత్యనారాయణ మాట్లాడారు.

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఆచంట : సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం పెనుమంట్ర ఐసిడిఎస్ కార్యాలయం ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పెనుమంట్ర ఐసిడిఎస్ సిడిపిఒ వి.కృష్ణకుమారి బుధవారం విలేకరులకు తెలిపారు. పెనుమంట్ర మండలం మల్లిపూడి 2లో అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. అంగన్వాడీ సహాయకులు పెనుమంట్ర 7లో, వివి పాలెం 2 లో, వెలగలేరు 2లో పెనుగొండ 13లో, మల్లపుదిబ్బ, సిద్ధాంతం 6 కేంద్రంలో, ఆచంట మండలం పద్మనాభుని చెరువు, వల్లూరు పంచాయతీ పరిధి నీరుల్లిపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధి మర్రిమూలలో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. దరఖాస్తులను ఈనెల 15 నుంచి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సిడిపిఒ కార్యాలయంకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. స్థానికులైన వివాహిత మహిళలు, 21 నుంచి 35 సంవత్సరాల లోపు మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కనీసం పదవ తరగతి పాసై అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ఆకివీడు : ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న ఖాళీల భర్తకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి వాణి విజయ రత్నం తెలిపారు. పాలకోడేరు మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో ఆరో నెంబర్ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త స్థానం ఖాళీగా ఉందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. కాగా మండలంలోని పెదకాపవరం, అప్పారావుపేట, గుమ్ములూరు టు కేంద్రాలలో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఉండి మండలంలోని ఉప్పులూరు 1, 2 రెండు కేంద్రాలు, కాళ్ల మండలంలోని కోపేల్ల, పాలకోడేరు మండలంలోని బంటుమిల్లి కేంద్రాలలో సహాయకుల స్థానాలకు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

పాలకొల్లు : ఈనెల 17వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి ఛాంబర్స్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శిక్షణ, ఉద్యోగ కల్పనా సంస్థ వికాస వారి సౌజన్యంతో 13 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు చెప్పారు. ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌డిబి, డెక్కన్ కెమికల్స్, పానాసోనిక్, ఇండో ఎంఐఎం, ఇసుజు, కాగ్నెంట్ వంటి బ్యాంకింగ్, ఐటి, నాన్ ఐటీ సంస్థలకు చెందిన 470 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడునని తెలిపారు. జీతం రూ.12,700 నుంచి రూ.36 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరగు అభ్యర్థులు రెజుమ్‌తో పాటు సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, వివరాలకు 9912046234, 9493503441 సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

సీసలిలో చదరంగం శిక్షణ తరగతులు

కాళ్ల : విద్యతోపాటు మేధస్సును అందించే చదరంగం క్రీడను ప్రోత్సహిస్తూ ఉండి నియోజకవర్గంలోని పాఠశాల విద్యార్థులకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు చేస్తున్న సహకారం మరువలేనిదని చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు అన్నారు. సీసలి హైస్కూల్లో చదరంగం ఆటపై ఉచిత శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభించారు. 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరుగుతాయి. చదరంగం ఆటపై ఉచిత శిక్షణ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి : ఎటువంటి గొడవలు లేకుండా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగినట్లు మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఉద్యోగోన్నతి పొందిన ఎంపిడిఒ ఎస్.రవీంద్రను ఎంపిపి శ్రీహరి నారాయణరాజు ఆధ్వర్యంలో సభ్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉండిలో బాధ్యతలు చేపట్టిన రవీంద్ర అనతికాలంలోనే అందరి ఆదరాభిమానాలు పొంది ఎన్నికల అనంతరం కూడా ఇక్కడే బాధ్యతలు నిర్వహించారని, ఇప్పుడు ఉద్యోగోన్నతి పొందడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.రవీంద్ర మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా మండలాభివృద్ధికి తనకు సహకరిస్తున్న తోటి సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి చల్లా వెంకట సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాంత్రిక ఉపకరణాల పంపిణీ

తాడేపల్లిగూడెం : నిజమైన రైతు రాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం రూరల్ మండలం, పెంటపాడు మండలాలకు చెందిన 98 మంది వ్యవసాయదారులకు రూ.38.01 లక్షల విలువైన వ్యవసాయ యాంత్రిక ఉపకరణాలైన పవర్ టిప్పర్స్, రోటోవేటర్స్, బ్యాటరీస్ ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ పాలనలో రైతులు ధాన్యం తోలితే డబ్బులు అందుతాయా లేదన్న ఎదురుచూపులతో నమ్మకాన్ని కోల్పోయారని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం రైతులకు స్వేచ్ఛను కల్పించి ప్రతి రైతుకు అందుబాటులో ఉండే విధంగా ఒక వార్ రూమ్ ఏర్పాటు చేసి రైతులకు, రైస్ మిల్లర్లకు వారధిగా నిలిచిన ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని అన్నారు. నేడు రైతులకు అందుబాటులో ఉన్న రైస్ మిల్లుకు ధాన్యం తోలిన 24 గంటల నుంచి 48 గంటల లోపు వారి ఖాతాల్లో డబ్బులు పడే విధంగా చర్యలు తీసుకుంటున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ప్రజలందరూ కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.